
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
శుక్రవారం 21 మార్చి 2025
జిల్లాల వార్తలు





పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయం

కొత్తగా మరో రెండు మున్సిపాలిటీలు!

చరిత్ర పుటల్లోకి పటాన్‌చెరు మండల పరిషత్

రామచంద్రాపురం టౌన్ మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో మరో రెండు మున్సిపాలిటీలు ఏర్పాటు చేసే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇటీవల తెల్లాపూర్ మున్సిపాలిటీలో కలిపిన ఐదు గ్రామాలను ఈ రెండు పురపాలికల్లో సర్దుబాటు చేస్తున్నారు. ఈమేరకు కలెక్టర్ కసరత్తు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. గతంలో పటాన్‌చెరు మండలంలో ఉన్న గ్రామాలన్నీ మున్సిపాలిటీల్లో కలవడంతో మండల పరిషత్ చరిత్రపుటల్లోకి ఎక్కనుంది. ఇంద్రేశం గ్రామం కేంద్రంగా బచ్చుగూడ, రామేశ్వరంబండ, ఐనోలు, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల గ్రామాలను కలుపుతూ మున్సిపాలిటీగా చేయనున్నారు. 44.4 కిలోమీటర్ల విస్తీర్ణం, 16,057 వేల జనాభాతో ఈ మున్సిపాలిటీ ఏర్పడనుంది. ఇటీవల తెల్లాపూర్ మున్సిపాలిటీలో కలిపిన ఘన్‌పూర్, పాటి గ్రామాలను విడదీసి భానూరు కేంద్రంగా.. క్యాసారం గ్రామంతో కలిపి మరో మున్సిపాలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ మున్సిపాలిటీ 50.83 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి, 24,983 జనాభా కలిగి ఉంటుందని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇస్నాపూర్ కేంద్రంగా ఏర్పాటయిన పురపాలికలో పాశమైలారం, చిట్కుల్ గ్రామాలు ఉండగా.. (తెల్లాపూర్ పురపాలికలో విలీనమయిన) ముత్తంగి, పోచారం గ్రామాలను కూడా కలుపుతారు. రుద్రారం, లక్డారం గ్రామాలను సైతం విలీనం చేయనున్నారు. దీంతో, ఈ మండలం విస్తీర్ణం 72.64 కిలోమీటర్లు 63.244 మంది జనాభాతో విస్తరించనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మండల వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఇందుకోసం తొలుత ప్రయోగాత్మకంగా పటాన్‌చెరు తాలుకాను మండలంగా ఏర్పాటు చేశారు. తాజాగా ఈ మండలంలోని అన్ని గ్రామాలను మున్సిపల్ పరిధిలోకి తేవడంతో మండల పరిషత్ తన ఉనికిని కోల్పోయింది. .

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:31 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 5:02 (శనివారం ఉదయం)

రోడ్డు ప్రమాదాల నివారణకు
కఠిన చర్యలు

బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రధాన రహదారులపై బ్లాక్‌స్పాట్ల గుర్తింపు

సమీక్షా సమావేశంలో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'ఉల్లంఘనులు' అనే శీర్షికన 19వ తేదీన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. రోడ్డు భద్రతా చర్యలపై ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రమాదాలకు కారణాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా తనిఖీలు ముమ్మరం చేయాలని, అవగాహన కల్పించాలని ఆర్టీవో, పోలీస్ అధికారులకు సూచించారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై నిర్మాణ లోపాలను గుర్తించి సరిచేయాలని ఆదేశించారు. అంబులెన్సులు, పెట్రోలింగ్ వాహనాలు, జేసీబీ, క్రేన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. హైవేల పక్కన చెత్తను డంపింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ఆర్అండ్‌బీ, పోలీసు శాఖల నుంచి ఒక్కో అధికారిని నియమించి సమన్వయం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, జిల్లా రవాణా అధికారిని అనిత, ఆర్డీవోలు, ఆర్అండ్‌బీ అధికారులు, పోలీస్, రవాణా, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల సంస్థ, ఆర్టీసీ, మునిసిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మల్కాపూర్ కాళేశ్వరం కాలువలో అడ్డంకులు తొలగిస్తున్న రైతులు

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఆ గ్రామాల రైతులు ఎదురుచూడలేదు. తమ పొలాలకు సాగు నీటిని చేరవేసేందుకు చందాలు వేసుకున్నారు. ప్రభుత్వం వదిలేసిన కాలువల నిర్మాణ పనులను పూర్తిచేయడానికి నడుం బిగించారు. వారి ప్రయత్నాలు ఫలించి కొన్ని గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరుతోంది. త్వరలోనే మరి కొన్ని గ్రామాలకూ నీరు అందనుంది.

రైతుల భగీరథ ప్రయత్నం

అసంపూర్తిగా ఉన్న కాళేశ్వరం కాల్వలకు జీవం

సొంత ఖర్చులతో పనులు

రైతుల చందాలతో తూప్రాన్, చేగుంట.. మండలాల్లోని చెరువులకు జల కళ

రెండు మండలాల్లో రూ.4.5 లక్షల వ్యయం



కాళేశ్వరం నీరు చేరడంతో అలుగు పారుతున్న మల్కాపూర్ చెరువు



రాంపూర్ చెరువుకు నీళ్లను తరలించడానికి ఎక్స్‌కవేటర్‌తో కాలువను తవ్విస్తున్న రైతులు

తూప్రాన్/చేగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్, చేగుంట మండలాల్లోని చెరువుల్లోకి కొండపోచమ్మ సాగర్ నుంచి కాళేశ్వరం జలాలను తరలించేందుకు చేపట్టిన కాలువల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం కాలువల నిర్మాణం పూర్తి చేస్తుందని రైతులు ఎదురుచూసినా అడుగు ముందుకుపడలేదు. ఈ యాసంగిలో పంటలకు నీరందక రైతులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న తరుణంలో ఆయా గ్రామాల చెరువుల్లోకి నీటిని తీసుకురావాలని రైతులు నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో ఆయకట్టు పొలాలున్న వారు సమావేశమై తలా కొంత చందాలు వేసి నిధులను సమీకరించుకున్నారు. ఈ మొత్తంతో పక్షం రోజులుగా కాలువల్లో ఆటంకాలను తొలగించే పనులను చేయిస్తున్నారు.

తూప్రాన్ మండలంలో..

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వీరానగర్ వరకు ఉన్న కాళేశ్వరం కాలువ నుంచి తూప్రాన్ మండలం మల్కాపూర్, గుండ్రెడ్డిపల్లి గ్రామాల్లోని చెరువులకు నీటిని తరలించాలని రైతులు భావించారు. వీరానగర్ వరకు కాలువల్లోకి నీరు వస్తోంది. అక్కడి నుంచి మెదక్ జిల్లా మల్కాపూర్ వరకు సుమారు 9 కి.మీ. దూరం నీటిని తీసుకెళ్లి చెరువుల్లోకి తరలించేందుకు నిర్ణయించారు. ఈ 9 కి.మీ. మేర కాలువ తవ్వకాన్ని గతంలోనే ప్రారంభించినా.. అక్కడక్కడ సుమారు 3 కి.మీ. మేర పనులు చేయకుండా వదిలేశారు. ఆ పనులను పూర్తిచేయాలని రైతులు నిర్ణయించారు. మల్కాపూర్, గుండ్రెడ్డిపల్లి శివారులో గొలుసుకట్టుగా ఉన్న కుంటలు, చెరువుల కింద సుమారు 400 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 250 మంది

మిగతా 8వ పేజీలో

21 ఏళ్ల పన్ను బకాయి వసూలు

మెదక్ బల్దియాకు రూ.1.74 కోట్ల ఆదాయం



చెక్కును అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 20: మెదక్ మున్సిపాలిటీలో ప్రభుత్వ భవనం నుంచి 21 ఏళ్ల పన్ను బకాయిలు వసూలు చేశారు. పట్టణంలోని కోర్టు సముదాయానికి చెందిన పన్ను 2004 నుంచి పన్ను చెల్లించడం లేదు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.లక్ష్మీశారదను కలిసి విన్నవించారు. ఆమె సానుకూలంగా స్పందించి ఈమేరకు శుక్రవారం 21 సంవత్సరాల కోర్టు భవన సముదాయాల పన్ను బకాయి రూ. 1,70,42,046 రూపాయల చెక్కును కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ భవానికి అందజేశారు.

వ్యవ'సాయం'

యాంత్రీకరణకు సర్కార్ చేయూత

తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ..

మహిళా రైతులకు ప్రాధాన్యం

గడువుతోనే కిరి..కిరి..

ఈ నెల 31వరకేనట..



రైతుకు సాగులో సాయం చేసేందుకు ప్రభుత్వం మరుగున పడ్డ మరో పథకానికి నిధులు మంజూరు చేసింది. గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ అమలు చేస్తోంది. 2024-25 సంవత్సరానికి గాను లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటికే దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ నెల 31 వరకే దరఖాస్తులు స్వీకరిస్తుండటం.. ఈ విషయంపై కనీస ప్రచారం లేకపోవడంతో అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు.

మెదక్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ఇప్పటికే రుణమాఫీ.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను అందజేస్తున్న ప్రభుత్వం రైతుల కోసం గతంలో ఆగిపోయిన ఓ పథకాన్ని మళ్లీ ప్రారంభించింది. యాసంగి పంట కాలం నుంచి రాయితీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేయనుంది.

తొమ్మిదేళ్ల క్రితం నిలిపివేత

సబ్సిడీ యంత్రాల పంపిణీ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసింది. అప్పటి నుంచి పరికరాల కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. పరికరాలు పంపిణీ చేయాలని కోరుతూనే ఉన్నారు. కానీ, రైతు బంధు వంటి పథకాలను అమలు చేస్తున్నందున సబ్సిడీ పరికరాల పంపిణీ అవసరం లేదని గత ప్రభుత్వం దీనిని నిలిపివేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించింది.

సబ్సిడీపై డ్రోన్లు

సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ పథకం(సబ్ మిషన్ ఆఫ్ ఫాం మెకనైజేషన్)లో భాగంగా రోటవేటర్లు, మ్యానువల్ ఆపరేటెడ్ పరికరాలు, పవర్ స్ప్రేయర్లతో పాటు డ్రోన్లు అందజేయనున్నారు. అయితే, ఈ పథకంలో మహిళా రైతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందుకోసం మెదక్ జిల్లాకు రూ. 78 లక్షలు మంజూరు కాగా, ఈ నెల 25 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరిస్తే, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను కేటాయిస్తుంది. 50 శాతం సబ్సిడీపై రైతులకు పరికరాలు అందజేయనున్నారు.

సాధ్యమేనా..

ఈ యాసంగి సీజన్ నుంచి సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేయాలని నిర్ణయించిన ప్రభుత్వం దరఖాస్తులకు తక్కువ గడువు విధించడం, ఎలాంటి ప్రచారం లేకుండా పథకాన్ని ప్రారంభించడంతో అర్హులైన రైతులకు పథకం అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుండగా, ఈ నెల 31 లోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని భావిస్తుండటంతో సన్న, చిన్నకారు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మహిళలకు డ్రోన్ కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్

సాగులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

డ్రోన్‌తో తక్కువ ఖర్చుతో మందులు, ఎరువు పిచికారీ

మహిళల శిక్షణకు పైలట్ ప్రాజెక్టుగా అందోలు : సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



జయహో దుర్గాభవానీ

సంగారెడ్డి మండలం ఈశ్వరపురంలోని దుర్గాభవానీ మాత ఆలయంలో లక్ష దీప మహోత్సవం కనులపండువగా జరిగింది. వేలామంది భక్తులు హాజరై దీపాలు వెలిగించారు.

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

ఆడపిల్ల పుడితే ఉచిత డెలివరీ

మెదక్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మెదక్ ఆజాంపురలో ఉన్న 'చిన్నారి' మాత, శిశు ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా ఆడపిల్ల పుడితే ఉచిత డెలివరీ చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈమేరకు ఆస్పత్రి యాజమాన్యం, డాక్టర్లు విలేకరులతో మాట్లాడుతూ నార్మల్ డెలివరీ లేదా సిజేరియన్ ఏదైనా ఆడపిల్ల పుడితే ఉచితంగా చేస్తామని చెప్పారు. ఆడబిడ్డలను తల్లిదండ్రులు భారంగా భావించకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పేదలకు మెరుగైన వైద్యం చేరువ చేయమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- సంగారెడ్డి జిల్లాలో 122 సెంటర్లు, 22,423 మంది విద్యార్థులు
- మెదక్ జిల్లాలో 68 పరీక్షా కేంద్రాలు, 10,387 మంది విద్యార్థులు
- 9.35 గంటల వరకే అనుమతి



సర్దనలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పే తరుణం ఆసన్నమైంది. రాత్రింబవళ్లు పుస్తకాలే నేస్తాలై చదివిన పదో తరగతి విద్యార్థులు తొలిసారి బోర్డు పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యారు. పదో తరగతి పరీక్షలు నేటి నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 122 పరీక్ష కేంద్రాల్లో 22,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు 1,348 మంది ఇన్విజిలేటర్లు, 5 మంది రూట్ టీమ్స్, 6 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 122 సిట్టింగ్ స్క్వాడ్స్, 52 మంది జాయింట్ కస్టోడియన్స్ 122 మంది చీఫ్ సూపరింటెండెంట్, 122 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. కాగా వయోజన విద్య డైరెక్టర్ ఉషారాణిని జిల్లా పరిశీలకులుగా నియమించారు. విద్యార్థుల సందేహాలకు 08455-276255, 8919677495 నంబర్లను సంప్రదించాలని డీఈవో వెంకటేశ్వర్లు కోరారు.

మెదక్ జిల్లాలో 68 కేంద్రాల్లో 10,387 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 3 ఫ్లయింగ్ బృందాలు, 19 సిట్టింగ్ స్క్వాడ్, కస్టోడియన్ బృందాలు, 500 మంది ఇన్విజిలేటర్లు, 68 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 68 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను ఏర్పాటు చేశారు. విద్యార్థులను పరీక్ష సమయానికి గంట ముందు నుంచే అనుమతిస్తారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన నంబర్ 949167647ను ఏర్పాటు చేశారు. హవేళిఘణపూర్ మండలంలోని సర్దన ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. నర్సాపూర్ పట్టణంలోని కేంద్రాల్లో ఏర్పాట్లను రాష్ట్ర అబ్జర్వర్ ఉషారాణి పరిశీలించారు.

సీసీ కెమెరాలతో నిఘా

పదో తరగతి పరీక్షలు నిఘా నీడలో కొనసాగనున్నాయి. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రంలోని హైదరాబాద్ విద్యాశాఖ కార్యాలయానికి అనుసంధానించారు. సీసీ కెమెరాల ముందు పరీక్ష కేంద్రాల్లో ప్రశ్న పత్రాలు ఓపెన్ చేయాల్సి ఉంటుంది. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఆన్‌లైన్ ద్వారా హైదరాబాద్‌లోని ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులు పరీక్షల తీరును నిరంతరం పర్యవేక్షించనున్నారు.

పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు : సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అలాగే ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు.

రుణాల పంపిణీ లక్ష్యాన్ని సాధించాలి

పంట రుణాలకు ప్రాధాన్యం : మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రుణాల పంపిణీలో లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వార్షిక ప్రణాళిక ప్రకారం వివిధరంగాల్లో రూ.5,857 కోట్ల రుణాలను అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ3,732.59 కోట్లు (63.72 శాతం) రుణాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా.. కొన్ని బ్యాంకులు వెనుకబడి ఉన్నాయన్నారు. వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జ్యాపం చేయొద్దని సూచించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు అవసరమైనచోట రోడ్డు డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం కృషిచేస్తుందన్నారు. క్రమంతప్పకుండా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు.



పరీక్షలు ముగిసే.. సెలవులొచ్చే..

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిశాయి. చివరి రోజు గురువారం సెకండియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు సంగారెడ్డి జిల్లాలో 1,5030 మంది, మెదక్ జిల్లాలో 5,026 మంది హాజరయ్యారు. కొద్ది నెలలుగా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో కేంద్రాల వద్ద ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. సెలవులు రావడంతో స్నేహితులకు వీడ్కోలు తెలిపారు. వసతిగృహాల నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు పిల్లలను ఆప్యాయంగా హత్తుకున్నారు. సామగ్రి సర్దుకొని ఇంటిబాట పట్టిన విద్యార్థులతో బస్టాండ్లు కిటకిటలాడాయి.

బొలెరో బోల్తాపడి ఒకరి మృతి.. పలువురికి గాయాలు

రాయికోడ్, మార్చి20 (ఆంధ్రజ్యోతి) : రేగోడ్ మండలం చౌదర్ పల్లి గ్రామానికి చెందిన సుమారు 20మంది గురువారం బొలెరోలో రాయికోడ్ మండలం హస్నాబాద్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా సింగితం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు బొలెరో బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న దొడ్ల మణెమ్మ, గంగమణి, మనూష, అశ్విత, హారిక, లక్కి, అంబమ్మలకు గాయాలయ్యాయి. వారిని 108లో జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మణెమ్మ(60) మార్గమధ్యలో మృతిచెందింది.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

● పరిస్థితి విషమం

శివ్వంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన అల్లీపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన నువ్వా శ్రీనివాస్(40) బుధవారం మధ్యాహ్నం ఉపాధి పనులకు వెళ్లి ఇంటికా రాగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఉన్నది. గ్రామంలో ఎస్సీ కాలనీలో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేస్తుండగా గ్రామంలో ఎల్‌సి ఉందని భావించిన శ్రీనివాస్ విద్యుత్ అధికారులకు సమాచారం లేకుండానే విద్యుత్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురైన అతడిని కుటుంబీకులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అత్తపై దాడి చేసిన అల్లుడికి రిమాండ్

పుల్‌కల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అత్తపై దాడి చేసిన అల్లుడికి రిమాండ్ విధించారు. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన పుల్కల్‌కు చెందిన ఇసోజీపేట చంద్రకళ కూతురు పూజితను 2019లో మునిపల్లి మండలం తక్కడపల్లి గ్రామానికి చెందిన గొల్ల కృష్ణకు ఇచ్చి వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. తాగుకు బానిసైన కృష్ణా కొన్ని రోజులు పుల్కల్‌లో, ఆ తరువాత సదాశివపేట ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ ఎదుట హోటల్‌ను ఏర్పాటు చేసి సరిగా నిర్వహించలేక మూసివేశాడు. అనంతరం కుటుంబ పోషణకై హైదరాబాద్ నగరానికి వెళ్లి కారు డ్రైవింగ్ చేశాడు. 2023 మార్చి 16వ తేదీన హైదరాబాద్ నుంచి పుల్కల్‌కు వచ్చి మద్యం తాగి భార్య పూజిత, అత్త చంద్రకళతో గొడవ పడ్డాడు. ఈ ఘర్షణలో అత్త చంద్రకళను బలంగా కొట్టడంతో ఆమె కోమాలోకి వెళ్లారు. దీనిపై భార్య పూజిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న కృష్ణను బుధవారం పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం జోగిపేట ప్రథమ శ్రేణి న్యాయాధికారి ఎదుట నిందితుడి ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

మృతుడి ఖాతాలో నుంచి రూ. లక్ష మాయం!

● మరో ఖాతాలోకి డబ్బు..

నర్సాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో డబ్బులు భద్రంగా ఉంటాయనుకుంటే అందులో కూడా మోసాలు జరుగుతుండటంతో ఏమిచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతా ఉన్న వ్యక్తి చనిపోగా, అతని ఖాతా నుంచి రూ. లక్షా రెండు వేలు మాయమయ్యాయి. ఇదేమని ప్రశ్నిస్తే పొరపాటు జరిగింది మళ్లీ ఖాతాలో వేస్తామని బ్యాంకు అధికారులు చెప్పడం గమనార్హం. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మూసాపేట గ్రామానికి చెందిన నాగమోళ్ల లక్ష్మయ్య తండ్రి ఆగమయ్యకు నర్సాపూర్ ఎస్‌బీఐలో ఖాతా ఉంది. అతను మూడేళ్ల క్రితం మరణించగా, అప్పటికే అతని ఖాతాలో రూ. లక్షా 53వేలు ఉన్నాయి. ఆ డబ్బును తనకు ఇవ్వాల్సిందిగా ఫిబ్రవరిలో బ్యాంకు అధికారులను కోరారు. తండ్రి డెత్ సర్టిఫికెట్‌తో పాటు ఇతర ధ్రువీకరణలు తీసుకువస్తే.. లక్ష్మణ్ పేరిట ఖాతా తెరిచి అందులో వేస్తామని చెప్పారు. ఈ మేరకు లక్ష్మయ్య ధ్రువపత్రాలు సమర్పించగా, కొత్త ఖాతా తెరిచి రూ. 50 వేలు మాత్రమే ఆ ఖాతాలో జమచేశారు. తండ్రి ఖాతాలో ఇంకా రూ. లక్షా రెండు వేలు ఉండటంతో వాటి కోసం బ్యాంకునకు వెళ్లగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. తర్వాత ఆ డబ్బు మరో ఖాతాలోకి వెళ్లింది. దీంతో బాధితుడు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌తో కలిసి బ్యాంకునకు వెళ్లి నిలదీశాడు. తమ పొరపాటు వల్ల డబ్బు మరో ఖాతాలోకి వెళ్లిందని, తిరిగి లక్ష్మయ్య ఖాతాలో వేస్తామని చెప్పారు.

యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ షురూ

● రెండు రోజులపాటు జిల్లాస్థాయి పోటీలు



పోటీల్లో పాల్గొన్నవారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలను నెహ్రూ యువ కేంద్ర, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి సునీత సభ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి మల్లన్న సాగర్ డిప్యూటీ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్వైకే సిద్దిపేట జిల్లా యువజన అధికారి ఏం. రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. స్క్రీనింగ్ కమిటీ ఎంపిక చేసిన 150 మంది విద్యార్థులు 2 రోజుల పాటు జరిగే జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్‌లో ఉపన్యసిస్తారు. గురువారం మొదటి రోజు నోడల్ జిల్లా నుంచి కొంతమంది విద్యార్థులు వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు. శుక్రవారం 150 మందిలో బెస్ట్ 10 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్ డా. ఎం. శ్రద్దానందం, పరీక్షల నియంత్రణ అధికారి డా. జి.సుదర్శనం, ఐక్యూఏసీ కోర్డినేటర్ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్క్రీనింగ్ ఇలా..

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో సిద్దిపేట జిల్లాను నోడల్ జిల్లాగా ఎంపిక చేశారు. ఈ జిల్లా పరిధిలోకి, సిద్దిపేట, మేడ్చల్ మల్కాజిగిరి, జనగామ జిల్లాలు వస్తాయి భారతీయ యూత్ పార్లమెంట్‌లో భాగంగా యువత అభిప్రాయాన్ని దేశ నిర్మాణంలో ఉపయోగించుకోవాలని ఉద్దేశంతో వీడియో సందేశాన్ని విద్యార్థుల నుంచి ఆహ్వానించారు. సిద్దిపేట నోడల్ జిల్లా పరిధిలో దాదాపు 800 మంది యువతి యువకులు వీడియో అప్లోడింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 150మందిని స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారిని జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ జిల్లా కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన న్యాయ నిర్ణేతల సమక్షంలో విద్యార్థులని స్క్రీనింగ్ చేస్తారు.

వ్యవసాయంలో మహిళలూ ఎదగాలి

● జిల్లా వ్యాప్తంగా మహిళలకు శిక్షణ
● పైలట్ ప్రాజెక్టు కింద అందోలు ఎంపిక
● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

జోగిపేట, మార్చి20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో మహిళలూ రాణించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. సాగుబడిలో సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయంలో ఎదిగేలా మహిళలకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని తెలిపారు. గురువారం స్థానిక మహిళా సమాఖ్య భవనంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 50 మంది మహిళా సంఘ సభ్యులకు డ్రోన్ వాడకంపై సెర్ప్- వ్యవసాయ శాఖ-హెటిరో డ్రగ్స్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను ఆమె, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా



మహిళా రైతులకు డ్రోన్ విడ్జెట్ కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్

కలెక్టర్ మాట్లాడుతూ సంప్రదాయ వ్యవసాయంలో సాంకేతికతను జోడించడం ద్వారా , పెట్టుబడి తగ్గడంతోపాటు, సస్యరక్షణ చర్యలు సరిగా చేపట్టవచ్చునన్నారు. డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయడం వల్ల ఎకరాకు రూ. 400 వరకు సంపాదించవచ్చునన్నారు. డ్రోన్ వాడకంలో రోజుకు సుమారు 20 ఎకరాల వరకూ మందులు చల్లవచ్చునని తెలిపారు. వారంలరోజుల పాటు అందించే డ్రోన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని అదనపు ఆదాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, హెటిరో డైరెక్టర్ సుధాకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ జంగా రెడ్డి, ఆర్డీవో పాండు,తహసీల్దారు విష్ణుసాగర్, ఎంపీడీవో రాజేశ్, సెర్ప్ ఏపీఎంలు మాణిక్యం (అందోలు), చంద్రశేఖర్ (వట్‌పల్లి), శివలక్ష్మి(పుల్కల్), మహిళా రైతులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన అన్నదాతలు


రాంపూర్ క్రాసింగ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నంగునూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం అక్కెనపల్లి మోయా తుమ్మెద పెద్ద వాగులోకి సాగునీరు చేరకముందే నిలిపివేశారని, తిరిగి విడుదల చేయాలని కోరుతూ సిద్దిపేట- హనుమకొండ రహదారిలోని రాంపూర్ క్రాసింగ్ వద్ద గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. అక్కెనపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. రంగనాయక సాగర్ ద్వారా సాగు నీరు అందకపోవడంతో వేసిన పంటలు చేతికందే సమయానికి ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎండాకాలంలో అక్కెనపల్లి, నంగునూరు పెద్ద వాగులోకి సాగు నీరు విడుదల చేయడంతో చివరి పంటవరకు సాగునీరు అందింది. ఈ సారి పెద్ద వాగు పై ఉన్న చెక్ డ్యామ్‌ల్లోకి సాగునీరు రాకముందే ఇరిగేషన్ అధికారులు నీటిని మరో వైపు మళ్లించారని ఆరోపించారు. అధికారులు అక్కెనపల్లి పెద్ద వాగులో ఉన్న చెక్ డ్యామ్‌లు అన్ని నింపేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్ పేట ఎస్ఐ ఎండీ ఆసిఫ్ పోలీస్ సిబ్బంది తో కలిసి అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇరిగేషన్ అధికారులు వచ్చి నీటిని విడుదల చేసేంత వరకూ రాస్తారోకో విరమించబోమని రైతులు మొండికేశారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించగా నీటిని విడుదల చేస్తామని వారు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రూ. 88 కోట్లతో అభివృద్ధి పనులు

● ఇప్పటివరకు రూ.5.33 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి అందజేత
● త్వరలో యంగ్ ఇండియా స్కూల్ భవన నిర్మాణానికి శ్రీకారం
● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

మెదక్, మార్చి20(ఆంధ్రజ్యోతి) : రూ. 88 కోట్లతో మెదక్ పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని స్టేడియం సమీపంలోని విద్యుత్ భవనంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 66 మంది లబ్ధిదారులకు రూ. 66.07 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి వరకు మొత్తం రూ.5.33 కోట్ల విలవైన కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. మెడికల్, నర్సింగ్ కళాశాలను తెచ్చుకోవడమే కాకుండా తరగతులనూ ప్రారంభించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. మెదక్‌లోనే సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎంఎస్ఎస్‌వో స్వచ్ఛంద సంస్థ పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఏదైనా పనికోసం కమీషన్‌లు అడిగితే అక్కడే నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గూడూరి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రావు, మాజీ తాజా కౌన్సిలర్‌లు దొంతి లక్ష్మి ముత్యంగౌడ్, ప్రవీణ్‌గౌడ్, దాయర రాజలింగం, లక్ష్మినారాయణ, ఆవారి శేఖర్, వసంత్, గోదల సాయి, అశోక్, రమేష్ పద్మ, మనోజ్, వెంకటనారాయణ, శ్రీనివాస్ చౌదరి, రాజు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

● నలుగురికి గాయాలు

జహీరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందిన సంఘటన జహీరాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్‌కు చెందిన ఖాజా ఫరీదుద్దీన్ తన స్నేహితులు అలీమోద్దీన్, నాసీర్, ముదాసీర్, రజువుద్దీన్‌లతో కలిసి రంజాన్ పర్వదినం సందర్భంగా బుధవారం ముంబయికి షాపింగ్ చేయడానికి వెళ్లారు. తిరిగు ప్రయాణంలో గురువారం మధ్యాహ్నం జహీరాబాద్ మీదుగా మహబూబ్‌నగర్‌కు కారులో వెళ్తుండగా పట్టణంలోని పాత ఆర్టీఏ చెక్‌పోస్టు సమీపంలో ఫ్లైఓవర్ వద్ద కారు డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖాజా ఫరీదుద్దీన్ మృతిచెందగా, మిగతావారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

బైక్ డివైడర్‌ను ఢీకొని యువకుడు..

● మరొకరి పరిస్థితి విషమం



ఘటనా స్థలంలో బాబు మృతదేహం

కుకునూరుపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను అతివేగంగా నడపడం వల్ల ఒకరు మృతిచెందగా, మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన కేసారం బాబు, యాదగిరి గురువారం కల్లు తాగి కుకునూరుపల్లి మండల కేంద్రానికి బైక్‌పై అతివేగంగా వస్తున్నారు. ఒక్కసారిగా బైకు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బాబు(25) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన యాదగిరిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రెడీమిక్స్ వాహనం ఢీకొని..

రామచంద్రాపురం టౌన్ మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడ గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్న రవితేజ (32) చందానగర్ జవహర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం విధులకు హాజరయ్యేందుకు ఎలక్ట్రిక్ స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో రెడీమిక్స్ వాహనం వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ అదుపు తప్పి రైతు..


బీరయ్య మృతదేహం

మద్దూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని లద్నూరులో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. లద్నూరు గ్రామానికి చెందిన కెమిడి బీరయ్య(65) వ్యవసాయ బోరు మోటారు కాలిపోవడంతో మరమ్మతుల కోసం జనగామ జిల్లా కేంద్రానికి వెళ్లి మరమ్మతులు చేయించాడు. డబ్బులు సరిపోకపోవడంతో గ్రామానికి వచ్చి డబ్బులు తీసుకుని జనగామకు వెళ్లాడు. అనంతరం పంపును ద్విచక్రవాహనంపై కట్టి తీసుకుని వస్తుండగా లద్నూరు గ్రామ శివారులోని మూల మలుపులో బైక్ అదుపు తప్పి పడిపోయాడు. 108లో చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

మనోహరాబాద్ మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రేతను పోలీసులు అరెస్టు చేశారు. మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ భూపాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ వెంచర్‌లో బైక్‌పై తిరుగుతున్న సర్కార్ పార్థు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 205 గ్రాముల గంజాయి లభించింది. విచారణ చేపట్టగా పరిశ్రమలలో పని చేసే కార్మికులకు గంజాయిని విక్రయిస్తున్నట్లు నిందితుడు తెలిపారు. ఈ మేరకు పార్థును అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆల్ప్రాజోలం సరఫరాదారుడికి పదేళ్ల జైలు


నిందితుడు గౌండ్ల మాధవ్ గౌడ్

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆల్ప్రాజోలం రవాణా చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డ నిందితుడికి న్యాయస్థానం 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. లక్ష జరిమానా విధించింది. సంగారెడ్డి సదాశివపేట మండలం ఆరూరు గ్రామానికి చెందిన గౌండ్ల మాధవ్ గౌడ్ 2022లో ఆల్ప్రాజోలం రవాణా చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న సంగారెడ్డి అడిషనల్ జిల్లా జడ్జి జయంతి నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 1లక్ష జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

ప్రహరీ వివాదంలో ఇంటి యజమాని ఆత్మహత్యాయత్నం

● ఎస్ఐ వేధింపులే కారణమని భార్య ఆరోపణ


చికిత్స పొందుతున్న శ్రీశైలం

కుకునూరుపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రెండు ఇళ్ల మధ్య నిర్మించిన గోడ వివాదంలో ఓ ఇంటి యజమాని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధితుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో తిప్పారం గ్రామానికి చెందిన డెవిడ్ గతంలో ఇల్లు నిర్మించుకున్నాడు. పక్కనే ఇండ్ల శ్రీశైలం తన స్థలంలో కొత్తగా ఇంటిని నిర్మించాడు శ్రీశైలంకు చెందిన ప్రహరీ తన ఇంటికి ఆనుకొని ఉందని డేవిడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ శ్రీనివాస్ పలుమార్లు గోడను తీసివేయాలని శ్రీశైలంకు సూచించాడు. గురువారం మధ్యాహ్నం కూడా కానిస్టేబుళ్లు ఇంటికి వెళ్లి గోడను తొలగించాలని చెప్పగా మనస్తాపం చెందిన శ్రీశైలం పోలీసుల ముందే ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగాడు. దీంతో అతడిని పోలీసులు తమ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోడ విషయంలో ఎస్ఐ శ్రీనివాస్ వేధించడంతోనే తన భర్త పురుగుల మందు తాగాడని శ్రీశైలం భార్య ఆమె ఆరోపించారు.

దారి వివాదంలో కుటుంబంపై దాడి

● పలువురికి తీవ్ర గాయాలు ● నలుగురిపై కేసు


దాడిలో తలకుతీవ్ర గాయాలైన బాలయ్య, అతడి కుటుంబ సభ్యులు

శివ్వంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దాయాదుల మధ్య ఘర్షణలో ఓ కుటుంబంపై దాడి చేయగా ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాసుపల్లి బాలయ్య, భిక్షపతి అన్నదమ్ములు. బాలయ్య ఇంటి వద్ద బోరు బావిలో నీళ్ల అడుగంటిపోవడంతో బోరు బావి తవ్వించడానికి తమ్ముడు భిక్షపతికి చెందిన బీడు పొలంలో నుంచి బోరు బండి కోసం దారి చేశారు. దీంతో భిక్షపతి ఆ దారిని నీళ్లతో నింపాడు. ఇది గమనించిన బాలయ్య కొడుకు నర్సింహులు మోటర్ విద్యుత్ కనెక్షన్ తొలగించాడు. బుధవారం భిక్షపతి మళ్లీ బోరు వేసి నీళ్ల పారబెడుతుండడంతో ఘర్షణ మొదలైంది. గురువారం ఉదయం గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని బాలయ్య, నర్సింహులు ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో భిక్షపతి హైదరాబాదులో ఉంటున్న తన కొడుకులు ప్రసాద్, రాజును పిలిపించి భార్య సుశీలతో కలిసి అర్ధరాత్రి బాలయ్య ఇంటికి వెళ్లి తలుపులు ధ్వంసం చేసి లోపలికి చొరబడి కత్తి, రాడ్లు, రాళ్లు, ఇటుకలతో కుటుంబంపై దాడికి దిగారు. ఈ ఘటనలో బాలయ్యతోపాటు అతడి భార్య పున్నమ్మ, కొడుకులు యాదగిరి, నర్సింహులు, కోడలు అంజమ్మ తీవ్రంగా గాయపడ్డారు. యాదగిరి, నర్సింహులు, అంజమ్మకు గాయాలతో తీవ్ర రక్త స్రావం కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ మధుకర్‌రెడ్డిని సంప్రదించగా బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన భిక్షపతి, అతడి భార్య సుశీల, కొడుకులు రాజు, ప్రసాద్‌లపై కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైభవంగా రుద్రపారాయణం, లక్ష పుష్పార్చన

వర్గల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ పర్యవేక్షణలో ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఆలయం వద్ద రుద్ర పారాయణం, ధ్వజారోహణం, భక్తులచే లక్ష పుష్పార్చన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మాధవానంద సరస్వతీ స్వామి, శ్రీక్షేత్రం పీఠాధిపతులు మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా కోర్టు జడ్జి సాయి రమాదేవితో పాటు పలువురు ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.


నాచగిరి క్షేత్రం వద్ద రుద్రపారయణంలో స్వామిజీలు


కరపత్రాలు పంచుతున్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

'మా కాలేజీలో చేరండి'

● ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రచారం

నర్సాపూర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా విద్య అందుతున్న మా కాలేజీలో చేరండి అంటూ పెద్దచింతకుంటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రచారం చేశారు. గురువారం ఇంటర్ పరీక్షలు ముగియడంతో నర్సాపూర్ జూనియర్ కాలేజీ కేంద్రం వద్ద కాలేజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సురేష్ ఆధ్వర్యంలో కరపత్రాలు పట్టుకుని పరీక్షలు రాసి వస్తున్న ఇంటర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ కాలేజీలో మంచి విద్యతో పాటు ఫ్యాకల్టీ, ల్యాబ్ ఇతర సదుపాయాలు ఉన్నాయని వివరించారు. ప్రైవేటులో చేరి డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ కళాశాలలోనే చేరాలని ప్రచారం చేశారు.

న్యూస్ బాక్స్

కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా రమేష్



కోహీర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా కే.రమేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కమిషనర్‌గా పనిచేసిన వెంకట్‌రెడ్డి పలు కారణాల వల్ల దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపల్‌లో మేనేజర్‌గా పనిచేసిన కే.రమేష్‌కు కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించారు. కమిషనర్‌ను పలువురు అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు శాలువా పూల మాలలతో సన్మానించారు.

మంత్రిని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు

పుల్‌కల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనరసింహను యువజన కాంగ్రెస్ నాయకులు కలిశారు. దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ కలను సాకారం చేయడంతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాణిక్యం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొండాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లేపల్లిలో గురువారం సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి పైగా ప్రజలు పాల్గొని ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో డీపీఎం దానియల్, డాక్టర్లు సంకీర్తన పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/మనూరు/పెద్దశంకరంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతను ఇస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఖేడ్ నియోజకవర్గంలోని 155 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, 21 మందికి సీఎంఆర్ చెక్కులను అందజేసి మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, తాహేర్, క్రిష్ణమూర్తి, దిగంబర్‌రెడ్డి, శ్రీకాంత్, కిష్టారెడ్డి, దత్తుగౌడ్, సాయిలు పాల్గొన్నారు. అలాగే నాగల్‌గిద్ద మండల పరిధిలోని గట్టులింగంపల్లి నుంచి రుద్రారం వరకు పీఎంజీఎస్‌వై నిధులు రూ.3.50 కోట్లతో చేపడుతున్న బీటీరోడ్డు నిర్మాణానికి, దీంతోపాటు తుమ్నూర్ గ్రామం నుంచి బాదల్‌గాం వరకు రూ.8 లక్షలతో చేపడుతున్న ఫార్మేషన్ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం దుద్దగొండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు స్థానిక నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం నాగల్‌గిద్ద మండల పరిధిలోని కరసగుత్తి ఎస్టీ బాలికల గురుకుల కళాశాలలో, ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం నాగల్‌గిద్ద మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మాణిక్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, తహసీల్దార్ శివక్రిష్ణ, ఎంఈవో మన్మథకిషోర్, ఎస్ఐ సాయిలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సచిన్‌పాటిల్ పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిరంతరం కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని పీహెచ్‌సీలో హైదరాబాద్‌కు చెందిన నీలకంటి దుర్గా ప్రసాద్, వారి మిత్ర బృందంతో పాటు పేటకు చెందిన బుగుడాల సాయిలు ఆస్పత్రికి అందించిన వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. దీనికితోడు పేట మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ రూ.30 వేల ఇన్వర్టర్‌ను పీహెచ్‌సీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సర్ఫోద్దీన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు, నాయకులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రైతుల భగీరథ ప్రయత్నం

5వ పేజీ తరువాయి

తలా రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు చందాలు వేసుకున్నారు. ఇప్పటికే పాక్షికంగా నిర్మించిన కాలువలో అడ్డుగా వచ్చిన రాళ్లను తొలగించి నీరు పారేందుకు మార్గం చేయిస్తున్నారు. రూ.3 లక్షలకుపైగా ఖర్చు చేసి రెండు రోజుల క్రితం వీరానగర్ నుంచి వడ్డెపల్లి, అప్పాయిపల్లి కుంట నుంచి మల్కాపూర్‌కు నీటిని తీసుకువచ్చారు. ప్రస్తుతం మల్కాపూర్ శివారులోని తుర్క చెరువులోకి నీరొచ్చింది. మూడు రోజుల్లో దంతెల కుంట, శెనిగె చెరువు నించి గుండ్రెడ్డిపల్లి శివారులోని పెద్దచెరువులోకి నీరు చేరనుంది.

చేగుంట మండలంలోనూ..

ప్రస్తుతం గొల్లపల్లి గ్రామ శివారు నుంచి తవ్వి ఉన్న ఓ కాలువ రాంపూర్ ఊర చెరువు పక్క నుంచి వెళుతోంది. ఈ కాలువ ద్వారా సమీప గ్రామాల్లోని గొలుసుకట్టు చెరువుల్లోకి నీరు చేరే అవకాశాలు లేవు. రాంపూర్ ఊర చెరువులోకి కాళేశ్వరం నీటిని తరలిస్తే 50-70 ఎకరాల ఆయకట్టుకు నీరందే అవకాశం ఉంది. రాంపూర్ చెరువు నుంచి కన్యారం చింతల కుంటకు కొంత మేరకు కాలువను తవ్వితే ఆ గ్రామంలో సుమారు 100 ఎకరాలకు నీరందుతుంది. రాంపూర్, కన్యారం, అనంతసాగర్ గ్రామాల గొలుసుకట్టు చెరువులకు నీరు చేరి పంటలు పండే అవకాశం ఉంది. ఈ పనుల కోసం ఆయా గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు చందాలు వేసుకున్నారు. ప్రస్తుతం పోగైన రూ.లక్షతో ఒక కి.మీ మేర పనులు చేస్తున్నారు. పనులు పూర్తి చేయడానికి మరో రూ.50 వేలు అవసరం అవుతాయని భావిస్తున్నారు.

విద్యార్థుల దృష్టి సమస్యలకు మెరుగైన చికిత్స

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో కంటి చూపు లోపాలను ముందస్తుగా గుర్తించి మెరుగైన చికిత్స అందేలా ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి చికిత్స అందిస్తున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి శాంతినగర్‌లోని మహాత్మాజ్యోతిబాఫూలే రెసిడెన్షియల్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లాలో 4,792 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించగా, అందులో 4,396 మందికి కళ్లద్దాలు అవసరమవుతాయని నిర్ణయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్, డాక్టరు పాల్గొన్నారు. జిల్లాలో ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు స్థానిక పార్టీల ప్రతినిధులు సహకారాన్ని అందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ నమోదు, బూత్ లెవల్ ఏజెంట్ల నియామకాలపై సమావేశం నిర్వహించి మాట్లాడారు.



విద్యార్థినికి కళ్లద్దాలు తొడుగుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గ్రంథాలయాలను తీర్చిదిద్దడమే లక్ష్యం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

నర్సాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో గ్రంథాలయాలను పాఠకులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ వచ్చిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 22 గ్రంథాలయాలు ఉన్నాయని, అన్నింటికి సొంత భవనాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. త్వరలో చిలప్‌చెడ్ మండలంలో నూతన గ్రంథాలయం ప్రారంభించనున్నట్లు చెప్పారు. జిల్లాలో 22 మంది లైబ్రేరియన్లు ఉండాల్సి ఉండగా.. ఏడుగురు మాత్రమే ఉన్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. జిల్లాలో సెస్‌ల రూపంలో గ్రంథాలయాలకు రూ.1.60 కోట్లు రావాల్సి ఉన్నదని, అందులో రూ.90 లక్షలు మెదక్ మున్సిపాలిటీ నుంచే రావాలన్నారు. నర్సాపూర్ గ్రంథాలయంలో రూ.60 లక్షలతో కంప్యూటర్లు, ప్రహరీ, మూత్రశాలలు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు తయారు చేసి నిధుల కోసం ప్రయత్నిస్తున్నట్లు సుహాసినిరెడ్డి తెలిపారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

వెల్దుర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని దుర్గా, తిరుమల మద్యం దుకాణాలను రామాయంపేట ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్ సిద్ధార్థ్ గురువారం తనిఖీ చేశారు. మద్యానికి సంబంధించిన రిజిస్టర్లు, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... అన్నిరకాల మద్యాన్ని, తగిన స్టాక్‌ను దుకాణాల్లో ఉంచాలని దుకాణదారులకు సూచించారు. దుర్గా వైన్స్ పర్మిట్ రూమ్ ఏర్పాటు నిబంధనలకు విరుద్ధంగా వెల్దుర్తి, మెదక్ ప్రధాన రహదారికి దగ్గరగా ఉందని ఆరోపణలు ఉన్నాయని సీఐ నరేందర్‌రెడ్డిని వివరణ అడుగగా.. మద్యం దుకాణాలకు దగ్గరగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. ఈ తనిఖీలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలకు బ్రేక్



నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఎల్పీవో అనిత

హత్నూర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులో గల ఎపిటోరియా (అరబిందో) యూనిట్-1, శ్రీసాయి ప్యాకేజ్ పరిశ్రమల్లో అక్రమ నిర్మాణాలపై సంగారెడ్డి డీఎల్పీవో అనిత క్షేత్ర స్థాయిలో విచారణ చేశారు. అక్కడ కొనసాగుతున్న నిర్మాణాలను నిలిపి వేయించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పూర్తిస్థాయి అనుమతులు పొందాకే పనులు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో యూసుఫ్, గ్రామ కార్యదర్శి రాకేష్ కుమార్, నాయకులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన నిధులు విడుదల

సంగారెడ్డి అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే వంట ఏజెన్సీలకు నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. పీఎం పోషణ ద్వారా విద్యార్థులకు అందించే గుడ్లు, ఏజెన్సీల గౌరవ వేతనాన్ని(కుక్ కమ్ హెల్పర్) మంజూరు చేసింది. జిల్లాలోని 1 నుంచి 8వ తరగతి వరకు గుడ్లకు సంబంధించి రూ.1,57,98,500 నిధులు, అదే విధంగా వంట ఏజెన్సీ మహిళలకు రూ.2 వేల చొప్పున రూ.1,36,84,000 నిధులు మంజూరు చేసింది. ఆయా నిధులను వారి ఖాతాల్లో జమచేసినట్టు కార్యాలయ అధికారులు తెలిపారు.

నందీశ్వర వాహనంలో వీరభద్రస్వామి ఊరేగింపు

గుమ్మడిదల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి వీరభద్రస్వామిని నందీశ్వర వాహనంలో చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్‌గుప్తా ఆధ్వర్యంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సోమయ్య, మాజీ సర్పంచ్ సురభీనాగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పనులు చేస్తారా..?

నర్సాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ నియోజకవర్గంలో కొన్ని చెరువుల వద్ద స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చేస్తున్న పనులపై ఎమ్మెల్యే సునీతారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో కొన్ని చెరువుల వద్ద సేవా కార్యక్రమం పేరిట స్వచ్ఛంద సంస్థలు మట్టి పనులు చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా స్థానిక అధికారులు పనులు ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. పైగా స్థానిక రైతుల పొలాలకు చెరువు మట్టి వేస్తున్నామన్న పేరుతో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వెంటనే స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న పనులను నిలిపేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే నల్లవల్లి సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేపడుతున్న దీక్ష గురువారం 30 రోజులకు చేరింది. ఈ దీక్షకు ఎమ్మెల్యే మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించానని, ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లానని చెప్పారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పాడి రైతులను ఆదుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న పాలరైతులు

సంగారెడ్డి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవిందాపూర్ శివారులో ఏర్పాటుచేసిన హట్సాన్ ఐస్‌క్రీం కర్మాగారం స్థానిక పాడి రైతుల నుంచే పాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ.. గురువారం పట్టణంలో పాల(పాడి) రైతులు ఆందోళన చేపట్టారు. అందులో భాగంగా పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్ వద్ద గుమిగూడి అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వెళ్లి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో హట్సాన్ కర్మాగారం ఏర్పాటైతుందంటే తామెంతో సంతోషపడ్డామన్నారు. కర్మాగారం కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పాలను తీసుకొస్తూ తమకు అన్యాయం చేస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్థానిక రైతుల నుంచి పాలను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని కోరారు.

మట్టి కుప్పలూ ఎత్తేందుకు నిధులు లేవట!

● జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ నిస్సహాయత

పటాన్‌చెరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వందల కోట్ల ఆదాయం, బడ్జెట్ ఉన్న జీహెచ్ఎంసీలో ఆలయం వద్ద మట్టికుప్పలు ఎత్తివేసేందుకు కూడా పైసా నిధులు లేవట?. ఇది పటాన్‌చెరు జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ నిస్సహాయతకు నిలువుటద్దం పడుతోంది. పటాన్‌చెరు డివిజన్‌లోని శాంతినగర్ ప్రసన్నాంజనేయ ఆలయం వద్ద పేరుకుపోయిన మట్టికుప్పలను తొలగించాలని కొంతకాలంగా భక్తులు కోరుతూ వస్తున్నారు. కాగా ఈ నెల 22న హిందూ నవయువక్ సేవాసంస్థ ఆధ్వర్యంలో 24 గంటల హరికీర్తన భజన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి అడ్డుగా ఉన్న మట్టి దిబ్బలను, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి మొర పెట్టుకున్నా స్పందించలేదు. దీంతో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సొంత డబ్బుతో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను పిలిపించి అరగంటలో మట్టికుప్పలను ఎత్తేయించారు. సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



ఆలయం వద్ద మట్టి కుప్పలు ఎత్తివేయిస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

డబుల్‌బెడ్ రూంలలో మౌలిక వసతులు

రామచంద్రాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్‌రూం(కేసీఆర్ నగర్) సముదాయాల్లోని సమస్యలను అధికారులు నెరవేరుస్తున్నారు. కలెక్టర్ క్రాంతి దృష్టికి తీసుకువెళ్లిన ప్రతి సమస్యపై అధికారులు దృష్టి సారించారు. గురువారం ప్రాథమిక పాఠశాలను కమిషనర్ సంగారెడ్డి, ఎంఈవో రాథోడ్‌లు ప్రారంభించారు. ఈ పాఠశాల 2025-26 నుంచి యథావిధిగా కొనసాగుతుందన్నారు. శుక్రవారం ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు బస్తీ దవాఖానాను కొల్లూరులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

‘బడ్జెట్ సవరించి కార్మికులకు న్యాయం చేయాలి’

నారాయణఖేడ్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సవరణలు చేసి కార్మికులకు వేతన పెంపుతో న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. గురువారం ఖేడ్ డివిజన్ పరిధిలోని సంఘం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. బడ్జెట్ కార్మికులు, ఉద్యోగులకు ఊరటనివ్వలేదన్నారు. కార్మికవర్గం ఊసేలేదన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నారాయణఖేడ్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది 101 మందికి కంటి పరీక్షలను నిర్వహించి, 53 మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు.

అమ్మవార్లకు బండ్ల ఊరేగింపు

టేక్మాల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన టేక్మాల్ మార్కెట్ ఆవరణలోని దుర్గమ్మ, పోచమ్మ జాతరలో భాగంగా గురువారం సాయంత్రం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, బాజాభజంత్రీల మధ్య బండ్లను ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. బండ్ల ఊరేగింపును తిలకించేందుకు మండల నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బకాయిలు చెల్లించని దుకాణాలు సీజ్

సంగారెడ్డి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆస్తిపన్ను బకాయిలు చెల్లించని నాలుగు దుకాణాలను మున్సిపల్ అధికారులు గురువారం సీజ్‌చేశారు. పన్నుల వసూళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సంగారెడ్డి బల్దియా అధికారులకు వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల 31వ తేదీలోగా వందశాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో మొండి బకాయిలపై ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే గురువారం నాలుగు దుకాణాలను సీజ్‌చేశారు. ఈ దుకాణాల నుంచి రూ.5 లక్షలు రావాల్సి ఉండగా.. చెల్లించకపోవడంతో సీజ్ చేశామన్నారు. సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపల్ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.14.22 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని డిమాండ్ ఉండగా.. ఇప్పటివరకు రూ.8.40 కోట్లు వసూలు చేశారు.



దుకాణాలను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

డంపింగ్‌యార్డు సమస్యపై ప్రజా బ్యాలెట్

గుమ్మడిదల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి పంచాయతీ ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ నేడు ఉదయం 8 నుంచి 1 గంట వరకు ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తున్నామని జేఏసీ ప్రజా సంఘాల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. గురువారం గుమ్మడిదల మండల కేంద్రంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్ష వద్ద నేడు చేపట్టబోయే బ్యాలెట్ కార్యక్రమం గురించి వివరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థల పరిశీలన

నిజాంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ‘ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షే’ అని వారంరోజుల క్రితం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు గురువారం స్పందించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆదేశానుసారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ స్థల పరిశీలన చేశారు. అలాగే పల్లె దవాఖానా పనులు పూర్తయినందున త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులకు లేఖలు

తూప్రాన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉన్నత ఫలితాలు సాధించడానికి తల్లిదండ్రులు కృషిచేయాలని ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ కోరారు. శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న పది పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు లేఖ (కరపత్రాలు)లు రూపొందించి అందజేశారు. పిల్లల భవితకు బాటలు వేద్దాం.. అంటూ లేఖలు ప్రధానోపాధ్యాయుల ద్వారా తల్లిదండ్రులకు పంపించారు.

పార్కుల అభివృద్ధికి నిధులు: కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పార్కులు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. గురువారం మల్లికార్జున్‌నగర్ కాలనీ పార్కు అభివృద్ధి పనులు ప్రారంభించి మాట్లాడారు. అన్ని కాలనీల్లో పార్కులు ఉండేటట్టు చర్యలు తీసుకున్నామని తెలిపారు. స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు తీసుకుంటూ కాలనీవాసులకు ఆహ్లాదాన్ని పంచేటట్టు పార్కులు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, డీఈ నరేందర్, ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

జిన్నారం, మార్చి, 20 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కార్మికుడు మృతిచెందాడు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన ప్రశాంత్(28) గడ్డపోతారం పరిధి అల్లీనగర్ పారిశ్రామికవాడలోని ఎస్ఆర్ ప్యాకేజ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటలకు విధులు నిర్వర్తిస్తూ కిందపడి మృతిచెందాడు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

రామచంద్రాపురం టౌన్/అమీన్‌పూర్/జిన్నారం/కల్హేర్/కంగ్టి/వెల్దుర్తి/సంగారెడ్డి/రామచంద్రాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవడం హర్షణీయమని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్ కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీరంగూడలో కాంగ్రెస్ అమీన్‌పూర్ మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, భ్రమరాంబ మల్లికార్జున ఆలయ చైర్మన్ సుధాకర్‌యాదవ్, జిన్నారం అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో, మండల కేంద్రమైన కల్హేర్‌లో మాజీ ఎంపీపీ మల్లేశం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వీర్‌శెట్టి తదితరుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పెద్దశంకరంపేటలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాందేడ్ దుర్గయ్య, కంగ్టి మండలంలో ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, వెల్దుర్తి మండలంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద, జహీరాబాద్ పట్టణంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో, తెల్లాపూర్‌లో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సీ.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పీ.అరుణ్‌గౌడ్, ధరణిరాజు, ఎస్. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.